## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి బియ్యం, కూరగాయలు అందజేత

కామవరపుకోట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆడమిల్లి గ్రామానికి చెందిన నల్లమిల్లి దివ్యశ్రీ కుటుంబ సభ్యులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, సీడ్ ఆర్గనైజర్ వేముల సాయి ఆధ్వర్యంలో బుధవారం 50 కేజీల బియ్యం, కూరగాయలను అందజేశారు. ఈ సందర్భంగా వేముల సాయి మాట్లాడుతూ దివ్యశ్రీ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వేముల శివాజీ, మల్లేష్, వీరమల్ల మధు, నల్లమిల్లి మోహన్‌రావు, దారం మురళి, కందికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఈవోకి విరాళం అందజేస్తున్న చిరంజీవి

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి బుధవారం దాతలు విరాళం అందజేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన పాదిలి చలపతిరావు కుమారుడు సూర్య చిరంజీవి రూ: 25,126 విరాళాన్ని ఆలయ ఈవో ఆకుల కొండలరావుకి అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి వారి ప్రసాదాన్ని ఈవో అందజేశారు.

### విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సందీప్, హేమలత

లింగపాలెం : గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో దోహదపడ్డాయని స్టేట్ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, సర్పంచ్ తగరం హేమలత అన్నారు. లింగపాలెం శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణాతరగతుల ముగింపు సందర్భంగా బుధవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్‌ఏ లతీఫ్, రిసోర్స్ పర్సన్లు ఎం.ప్రభాకరావు, ఎం.తరణ్, సురేష్ చంద్రన్ పాల్గొన్నారు.

### వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం



కొమ్ముగూడెంలో కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : మండలంలోని లక్ష్ముడుగూడెం సచివాలయ కార్యదర్శి కొవ్వాసు వెంకటేశ్వరరావు మంగయ్యపాలెం కార్యదర్శిగా బదిలీ అయిన సందర్భంగా బుధవారం కొమ్ముగూడెం సచివాయం వద్ద పంచాయతీ పాలకవర్గం, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మడకం రామలక్ష్మి, ఉప సర్పంచ్ రేపాకుల చంద్రం, ఎంపీటీసీ చారపు సుజాత మాట్లాడుతూ కార్యదర్శి వెంకటేశ్వరరావు గ్రామాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలగర నాని, అనుపోజు మురళీ, వీఆర్‌వో ఆషా, అలివేరు కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### పోటీపరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



చిలకల నాగేంద్రరెడ్డి, ఏపీఈఏపీసెట్‌లో 453 ర్యాంకు



కోలా జస్వంత్ ఫణి ప్రసాద్, ఏపీఈఏపీసెట్‌లో 465 ర్యాంకు

జంగారెడ్డిగూడెం : ఏపీఈఏపీసెట్‌లో జంగారెడ్డిగూడెం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చిలకల నాగేంద్రరెడ్డి 453 వ ర్యాంకు సాధించగా కోలా జస్వంత్ ఫణిప్రసాద్ 465 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

# పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



పోలవరం రూరల్ : అవగాహన కల్పిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ దాకే మంగాయమ్మ



కామవరపుకోట : ఆడమిల్లిలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



బుట్టాయగూడెం : తెల్లంవారిగూడెంలో మాట్లాడుతున్న సీడీపీఓ తులసి

పోలవరం రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పిల్లలందరికి సక్రమంగా అందించాలని ఏఎంసీ డైరెక్టర్ దాకే మంగాయమ్మ సూచించారు. పోలవరం మండలం పట్టిసం గ్రామంలోని ఎస్సీ పేటలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లల ఆరోగ్యం విషయంలో, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాకే సుబ్బారావు, తొర్లపాటి మంజుల, అంగన్‌వాడీ కార్యకర్త దాకే నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి**

కామవరపుకోట : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగపరచుకోవాలని తడికలపూడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీరాకుమారి అన్నారు. జన్‌భగిదారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆడమిల్లి గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలు వారి సాంఘిక, భాష, సృజనాత్మక, నైపుణ్యత, సమగ్రత, శారీరక, మేధా అభివృద్ధి వంటి అనేక అంశాలు పెంపొందించుకోవడానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బుట్టాయగూడెంలో...**

బుట్టాయగూడెం : బాల్యదశలో కలింగిచే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని బుట్టాయగూడెం సీడీపీవో తులసి అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన్‌భగిదారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సమాజంలో వారి ప్రవర్తన పిల్లల శారీరక, మానిసిక, వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. ఈ పరిస్థితులపై తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ప్రాథమిక విద్యా కార్యక్రమాల ఆవశ్యకతపై అవగాహన కల్గించే విధంగా జన్‌భగీదారీ కార్యక్రమం చేట్టడం జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొమ్ముగూడెంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.

### జంగారెడ్డిగూడెం డిపో నుంచి అరుణాచల యాత్ర

జంగారెడ్డిగూడెం : జూలై 3వ తేదీ గురుపౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయడానికి వెళ్లే భక్తులకు జంగారెడ్డిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సు జూలై 1వ తేదీ రాత్రి 7 గంటలకు జంగారెడ్డిగూడెం డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. 2వ తేదీ తెల్లవారుజామున శ్రీకాళహస్తి చేరుకుని అక్కడ నుంచి కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 3వ తేదీ గురుపౌర్ణమి దర్శన అనంతరం అరుణాచలంలో బయలుదేరి 4వ తేదీ ఉదయం జంగారెడ్డిగూడెం చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ధర ఒకరికి రూ. 2800 నిర్ణయించడం జరిగిందన్నారు. కావున భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 99592 25489, 94910 19105, 73829 07490 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# విద్యాకానుక కిట్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాముడు, ఎస్ఎంసీ చైర్మన్ దుర్గారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దల్లి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ బడి దుర్గారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. తిరుమలాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. సర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల రత్నకుమారి, కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్, సొసైటీ చైర్మన్ రాజులపాటి అన్నవరం, మాజీ సర్పంచ్ కనుపర్తి వేణుమాధవ్, మాజీ ఎంపీటీసీ కేఎల్ఎన్ ధనకుమార్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ



కామవరపుకోట : ఎంపీ యూపీ స్కూల్లో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ అనూష

**జగనన్న విద్యా కానుక కిట్ల అందజేత**

కామవరపుకోట : స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో కామవరపుకోట సర్పంచ్ కర్రిపోతు అనూష విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడూరు రంగబాబు, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, తుమ్మలపల్లి శ్రీను, ఉపాధ్యాయులు సరళ దేవి, పాల్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



యువతకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలతో పాటు క్రీడా రంగాన్ని సైతం అభివృద్ధి చేస్తుందని ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలోని యువతకు క్రీడలలో భరోసా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం, అంకాలగూడెం, బోడిగూడెం, రేపల్లెవాడ, పరింపూడి గ్రామాలకు చెందిన యువతకు ఆయన గతంలో ఇచ్చిన హామీ మేరకు సొంత ఖర్చులతో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆరు నెలల క్రితం ఇచ్చిన హామీని బాలరాజు గుర్తు పెట్టుకొని కిట్లను అందజేసినందుకు యువజన సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రూ.15 వేలు విలువైన క్రికెట్, వాలీబాల్ కిట్లను యువజట్లకు అందించారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సచివాలయం మండల కన్వీనర్ నూకల రాము, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

# శిక్షణతో సేవకు మరింత కృషి

కొయ్యలగూడెం : జెడ్పీటీసీలకు నిర్వహించిన శిక్షణా తరగతులలో తెలుసుకున్న అంశాల వలన ప్రజాసేవకి మరింత కృషి చేయడానికి ఆస్కారం లభించిందని పోలవరం నియోజకవర్గ జెడ్పీటీసీల బృందం పేర్కొంది. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఉమ్మడి గోదావరి జిల్లాల జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణా తరగతుల కార్యక్రమం ప్రభుత్వం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించినట్లు తెలిపారు. 12,13,14 తేదీలలో తాము శిక్షణ తరగతులలో పాల్గొని విధుల నిర్వహణకు తెలుసుకోవలసిన అంశాలతో పాటు అభివృద్ధి కోసం నిధుల సమీకరణ చేసే మార్గాలను తెలుసుకున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన జిల్లా పరిషత్ అధికారులు అవగతం అయ్యే రీతిలో బోధించారని దీనివల్ల అనేక విషయాలు బోధపడినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన వల్ల కోల్పోయిన వనరులను తిరిగి సాధించుకునే విధి విధానాలు తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి, మొడియం రామతులసి, కలుం హేమకుమారి, ఎం.వసంతరావు, కుంజా నాగేశ్వరరావు, జి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తీసుకున్న పోలవరం నియోజకవర్గ జెడ్పీటీసీ సభ్యులు

# పేదల జీవితాల్లో వెలుగులు నింపింది జగనన్నే

కొయ్యలగూడెం : రాజవరం గ్రామ పంచాయతీ గంగవరం గ్రామంలో భూ హక్కు పత్రాలు పొందిన ప్రజలు సచివాలయం-2 వద్ద బుధవారం సమావేశమై తమ సంతోషం వ్యక్తం చేశారు. భూ హక్కు పత్రాలు కలిగి ఉండడం తమకు నీడ, భుక్తి కలగడానికి దోహదపడుతుందని ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేదవాడి సొంతింటి కలను సార్థకం చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రజల జీవితాలలో వెలుగును నింపింది అని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ పేర్కొన్నారు. గత ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశామని, కానీ జగనన్న పుణ్యంతో ఈరోజు సొంత ఇళ్లు నిర్మించుకోగలిగామని, వచ్చే ఎన్నికల్లో ఈసారి జగనన్నకే ఓటు వేసి రుణం తీర్చుకుంటామని కొందరు వ్యక్తులు పేర్కొన్నారు. ఎంపీటీసీ కొండేపటి చింతయ్య, కొదారి ప్రభాకర్, కొదారి చిన్న, గృహసారధి ఉండి ఆనందరావు, సచివాలయ కన్వీనర్ ఇడుపుఘంటి తాతయ్య, గ్రామంలో లబ్ధిదారులు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



గంగవరంలో హర్షం వ్యక్తం చేస్తున్న భూ హక్కు పత్రాలు పొందిన లబ్ధిదారులు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శివారులో రోడ్డు ప్రమాదంలో బుధవారం ఒక యువకుడు మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం మండలం వెంకట రామానుజపురానికి చెందిన భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈప్రమాదంలో మృతి చెందాడు. కామవరపుకోట నుంచి స్వగ్రామమైన వెంకట రామానుజపురానికి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి మృతి చెందాడా లేక ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు.

## కౌలురైతులకు సాగు హక్కు పత్రాలు అందించాలి

పోలవరం రూరల్ : మండలంలోని కౌలు సాగుదారులను గుర్తించి పంట సాగుదారుల హక్కు పత్రాలను (సీసీఆర్‌సీ) అందజేయాలని తహసీల్దార్ బి.సుమతి సిబ్బందికి సూచించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో ఆమె మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబుతో కలిసి రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వీఆర్‌వోలకు ఖరీఫ్-2023 సీజన్‌కు సంబంధించి చేయాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. పంట సాగుదారుల హక్కుపత్రం 11 నెలల కాలపరిమితి ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు వైఎస్సార్ రైతు భరోసా పథకానికి అర్హులన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటకు క్రాప్ ఇన్సూరెన్స్, పెట్టుబడి రాయితీలను పొందవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తమ పంటకు మద్దతు ధర కొనుగోలు చేసుకునే అవకాశం ఉందన్నారు. గత సంవత్సరం తీసుకున్న కౌలు రైతుల కార్డులను రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతులు అందరూ వారు సాగు చేస్తున్న పొలాలకు సంబంధించి దగ్గర్లోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల్లో దరఖాస్తు అందించి సాగుదారుల హక్కు పత్రాలు పొందాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.సుమతి

## 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం నుంచి జాజులకుంట వరకు 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ, మేనేజింగ్ డైరెక్టర్ యిమ్మడి పృథ్వీతేజ్‌కు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో పృథ్వీతేజ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందించి పలు సమస్యలను విన్నవించారు. ప్రస్తుతం జాజులకుంటకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమడోలులోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఎం.నాగులపల్లి సబ్‌స్టేషన్‌కు, అక్కడి నుంచి జాజులకుంట సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. దూరం ఎక్కువగా ఉండటం వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అదే వెంకటకృష్ణాపురం నుంచి తిమ్మాపురం వరకు ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న జాజులకుంటకు విస్తరిస్తే రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. అదే విధంగా ఐఎస్.జగన్నాధపురంలోని ఎస్సీ కాలనీలో అవసరానికి అనుగుణంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పృథ్వీతేజ్ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. వాసు వెంట తిరుమలంపాలెం సొసైటీ చైర్‌పర్సన్ భోగరాజు చిన్ని తదితరులున్నారు.



ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాసు

## స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోండి

జంగారెడ్డిగూడెం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ టెక్‌బీని ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో 2022, 2023 విద్యాసంవత్సరాల్లో ఇంటర్మీడియేట్ 60శాతం మార్కులతో పూర్తిచేసిన విద్యార్థులు ఎర్లీ కెరియర్ ప్రోగామ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ ప్రోగామ్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.10వేలు స్టైఫండ్‌తో పాటు, 6 నెలల ఇంటర్న్‌షిప్, ఒక సంవత్సరం శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయిన తరువాత హెచ్‌సీఎల్‌లో ఫుల్‌టైమ్ ఉద్యోగం లభిస్తుందన్నారు. అలాగే ఉన్నత విద్యను అభ్యసించేందుకు హెచ్‌సీఎల్ ద్వారా ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. టెక్‌బీ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీన పట్టణంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నా

ఏలూరు (టూటౌన్): పశ్చిమగోదావరి జిల్లా చించినాడ పేదలు అక్రమ మట్టి తవ్వకాలపై చేస్తున్న ఆందోళనలపై లాఠీచార్జీ చేసి అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఏలూరులో బుధవారం ధర్నా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నగర అధ్యక్షుడు పీ.కిషోర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న అసైన్డ్ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు తవ్వడం దారుణమన్నారు. వాస్తవానికి గోదావరిని ఆనుకుని ఉన్న భూముల్లో మట్టి తవ్వకాలు నిషేధమని గుర్తు చేశారు. చించినాడలో పోరాడుతున్న పేదలకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బీ. బలరాం, ఇతర ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం తగదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు.

### వేళాంగిణి (నాగపట్నం) యాత్రకు ప్రత్యేక బస్సు

జంగారెడ్డిగూడెం : వేళాంగిణి (నాగపట్నం) యాత్రకు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాలలో గల వేళాంగిణి మాత భక్తుల సౌకర్యార్థం వేళాంగిణి యాత్రకు ఈ నెల 24వ తేదీ ఉదయం 10.00 గంటలకు జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు (సూపర్ లగ్జరీ) ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు శనివారం ఉదయం జంగారెడ్డిగూడెం నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం వేళాంగిణి చేరుతుందన్నారు. ఆ రోజు అక్కడ తెలుగు దివ్య పూజాబలి చూసుకుని రాత్రి అక్కడే బస చేసి సోమవారం ఉదయం బయలుదేరి మధ్యాహ్నం చెన్నై నగరంలోని సెయింట్ థామస్ మౌంట్ (పరిశుద్ధ థామస్ వారి సమాధి), సాయంత్రం మెరీనా బీచ్ చూసుకుని రాత్రికి బయలుదేరి మంగళవారం ఉదయానికి జంగారెడ్డిగూడెం చేరుకుంటుందన్నారు. టికెట్ ధర ఒకరికి రూ.3900గా నిర్ణయించినట్లు చెప్పారు. కాగా 35 మంది ఉన్నచో ప్రయాణీకులు కోరిన రోజు బస్సు ఏర్పాటు చేస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

### బాలాజీ సేవలు చిరస్మరణీయం



బాలాజీ సంతాప సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారావు

టి.నరసాపురం : హెచ్‌సీ బాలాజీ సేవలు చిరస్మరణీయం అని తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎస్సై కె.సతీష్‌కుమార్ అన్నారు. టి.నరసాపురం పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం బాలాజీ సంస్మరణ, సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా బాలాజీ టి.నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ పలువురు మన్ననలు పొందారని, ఆయన సేవలను గుర్తు చేశారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందడం తీరని లోటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు, సహకార సంఘం చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, ఎంపీటీసీ బండి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాకారపు సూరిబాబు, దేవరపల్లి సీతారామ ప్రసాద్, బొల్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాధనాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### బొర్రంపాలెంలో విజిలెన్స్ దాడులు



ఎరువులు, విత్తనాల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

టి.నరసాపురం: బొర్రంపాలెంలోని ఓ ఎరువులు, విత్తనాల దుకాణంపై బుధవారం విజిలెన్స్ సీఐ వీజే విల్సన్, మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, విజిలెన్స్ ఏవో పి.సురేష్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో స్టాక్‌ను సీజ్ చేసి, దుకాణం యజమానిపై కేసులను నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల మక్కినవారిగూడెంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖలు చేసిన దాడుల్లో లైసెన్స్ లేకుండా ధాన్యం విత్తనాలను విక్రయిస్తున్నట్లు మహంకాళి అనే వ్యక్తిపై కేసులు నమోదు చేశారు. ఇతనికి బొర్రంపాలెంలోని మెన్యూ డిపో నుంచి విత్తనాలు సరఫరా అయినట్లు గుర్తించారు. ఈ మేరకు బొరంపాలెంలో వందనపు రుక్కయ్యకు చెందిన మెన్యూర్ డిపోపై బుధవారం దాడి చేసి స్టాక్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్ కన్నా పీఎల్ఏ-1100 వరి విత్తనాలు రూ.40 వేలు విలువ చేసే 40 బస్తాలు తక్కువ ఉన్నట్లు, అలాగే రూ.33,840 విలువ చేసే 4.7 టన్నుల సూపర్ నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దుకాణం యజమానిపై 6ఎ, 7(1) కేసులను నమోదు చేశారు.

### నేడు డయల్ యువర్ డీఎం

జంగారెడ్డిగూడెం : డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల ప్రజలు తమ ప్రయాణ సంబంధిత సమస్యలను, సలహాలను ఫోన్ 99592 25489 ద్వారా తెలియజేయాలని సూచించారు.